క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కపిలేశ్వరపురం (మండపేట): ఎస్సీ సామాజిక వర్గీయుల నుంచి ఉచిత వాహన డ్రైవింగ్ శిక్షణ పొందేందుకై దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. హెవీ మోటారు వెహికల్ ఉచిత డ్రైవింగ్ శిక్షణ పొందేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలకు శిక్షణ అవకాశం కల్పించనున్నారన్నారు. 20 ఏళ్ల పైబడిన ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఏడాది కాల పరిమితిగల లైట్ మోటారు వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు అర్హులన్నారు. ఈ నెల 27న సాయంత్రం 5లోపు కాకినాడ ప్రగతి భవన్‌లోని జిల్లా షెడ్యూల్ కులాల సహకార సంఘం లిమిటెడ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఉత్సవాలకు రాట ముహూర్తం

కె.గంగవరం: మండలంలోని తామరపల్లిలో ఆదివారం వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం చేశారు. గ్రామానికి చెందిన గ్రామ గణేష్ యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం పక్కన ఏటా గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా ఈ ఏడాది ఉత్సవాలకు సంబంధించి రాట ముహూర్తం పూజలు చేసి రాటను పాతారు. వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

నాగేశ్వరరావుకు సేవా పురస్కారం



అవార్డు అందుకుంటున్న చిల్లే నాగేశ్వరరావు

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లికి చెందిన చిల్లే నాగేశ్వరరావు జాతీయ మదర్ థెరిస్సా సేవా పురస్కారం అందుకున్నారు. ఆదివారం జిల్లా పరిధిలోని రావులపాలెంలో మదర్ థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో భారతరత్న సెయింట్ మదర్ థెరిస్సా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో వివిధ విభాగాల్లోని వ్యక్తులకు మదర్ థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ పురస్కారాలు అందించారు. దీనిలో భాగంగా నాగేశ్వరరావుకు సేవా విభాగంగా మదర్ థెరిస్సా సేవా అవార్డును సంస్థ సభ్యులు వీర్రాఘవరెడ్డి, సుబ్బరాజు అందించి ఘనంగా సత్కరించారు.


పలు సేవా కార్యక్రమాలు



మున్సిపల్ కార్మికులకు దుప్పట్లు అందజేస్తున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పుట్టినరోజు సందర్భంగా ఆమె ఆధ్వర్యంలో ఆదివారం రథం సెంటర్ వద్ద ఆమె కార్యాలయంలో 140 మంది పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ కార్యాలయంలో పేదలకు అన్నదానం చేశారు. శ్రీలక్ష్మీ గణపతి ఆటో యూనియన్ రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు పెనుముచ్చి బాబు సుకుమార్ ,మాజీ అధ్యక్షుడు లంక జాను ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు అందజేశారు. చైర్‌పర్సన్ దుర్గారాణికి వైఎస్సార్ సీపీ మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన



పీఎం సూర్యఘర్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఏడీఈ

రాయవరం: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ మండపేట ఏడీఈ శ్రీధర్ అన్నారు. మండలంలోని పసలపూడిలో ఆదివారం ఆయన పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా పథకాన్ని తీర్చిదిద్దిందన్నారు. మండలంలో 2,042 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు వినియోగదారులుగా ఉన్నారని తెలిపారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగం చేస్తున్న వారు 1,648 మంది ఉండగా, డాబా ఇల్లు ఉన్న 1,102 మంది వినియోగదారులు ఈ పథకానికి అర్హులన్నారు. మండలంలో ఇప్పటి వరకు 400 మంది గృహ వినియోగదారులు పీఎం సూర్యఘర్ పథకానికి దరఖాస్తులు చేసినట్లు ఆయన తెలిపారు. సూర్యఘర్ పథకంలో రూ.1.40 లక్షల విలువైన సోలార్ ఫలకాలను వినియోగదారుని ఇంటిపై ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ కర్రి వెంకటరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, రామకృష్ణ, లైన్‌మేన్స్ పాల్గొన్నారు.

భౌ‘బోయ్’.. కరిచేస్తున్నాయ్!

- రోడ్డుపై వెళ్లాలంటే హడలిపోతున్న ప్రజలు
- శునకాల దాడికి ఇద్దరు, ముగ్గురు బలి
- గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు



రామచంద్రపురంలోని హౌసింగ్ బోర్డులో సంచరిస్తున్న కుక్కల గుంపు

రామచంద్రపురం: రోడ్డు మీద నడిచి వెళ్లాలంటేనే వీధి కుక్కలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ఏక్షణంలో దాడి చేస్తాయో తెలియక మహిళలు, చిన్నారులు ఒంటరిగా నడిచి వెళ్లేందుకు భయపడుతున్నారు. రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల అత్యధికంగా వీధి కుక్కలు పెరిగిపోయాయి. గత 10 ఏళ్లగా కుక్కలు పెరగకుండా ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతో వాటి సంఖ్య పెరిగిపోయింది. ప్రతి వీధిలోనూ గుంపులుగా కుక్కలు సంచరించటంతో ఎవరిని కరుస్తాయో అని ఒంటరిగా వెళ్లకుండా ఇద్దరు, ముగ్గురు సహాయంతో వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి. ప్రతి చోట వీధి కుక్కలు సంచరిస్తుండటంతో పిల్లలను స్కూళ్లకు, బయటకు పంపేందుకు తల్లిదండ్రులు హడలిపోతున్నారు.

అధికంగా దాడులు

మున్సిపాలిటీలో సుమారుగా 10 ఏళ్ల క్రితం కుక్కలను పట్టుకొని కాకినాడ తరలించి వాటికి స్టెరిలేజన్స్ చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. కానీ, అప్పట్లో ఈ ప్రక్రియ మధ్యలోనే అగిపోయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు కుక్కల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవటం గమనార్హం. రామచంద్రపురం మున్సిపాలిటీలోని 28 వార్డుల్లోనూ ప్రతి రోజూ ఇద్దరు నుంచి ముగ్గురు కుక్కకాటుకు గురై ఆసుపత్రికి వెళ్తున్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రతి నెల 40 నుంచి 50 మంది వరకు కుక్కకాటుకు గురైన వారు వస్తున్నారు. ముఖ్యంగా కాకినాడ వెళ్లే రహదారిలో కబేళా ఉండటంతో అక్కడ నుంచి అధిక సంఖ్యలో పట్టణంలోకి కుక్కలు తరలివస్తున్నాయి. హౌసింగ్ బోర్డు, శివాలయం వీధి, గుబ్బలవారిపేట, శాంతినగర్, జల్లిపేట, రాజగోపాల్ సెంటర్, శీలం వారి సావరం వంటి పరిసర ప్రాంతాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. ఉదయం పాఠశాలకు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇంటికి వచ్చేటప్పుడు పిల్లలను తల్లిదండ్రులు దగ్గరుండి తీసుకురావాల్సి వస్తుంది. కుక్కల దాడులు అధికంగా ఉండటంతో భయపడుతున్నామని ప్రజలు అంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కుక్కలు దగ్గరకు వస్తే ఏమాత్రం కదలకుండా నిలబడి ఉండటం ఉత్తమం. అవి దగ్గర ఉన్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగెత్తరాదు. వాటి కళ్లలోకి నేరుగా చూడరాదు. కుక్క పిల్లల దగ్గరకు వెళ్లకూడదు. తల్లి కుక్క దాడి చేసే ప్రమాదం ఉంది.
- కుక్కలు నిద్రిస్తున్నప్పుడు, తింటున్నప్పుడు, పిల్లలకు పాలిస్తున్నప్పుడు వాటిని కర్రలు, రాళ్లతో బెదిరించటం, ఏ రకంగా ఇబ్బంది పెట్టడం చేయకూడదు.
- పెంపుడు కుక్కలను యజమానులు వీధుల్లోనికి వదలకూడదు. ఎప్పుడూ కట్టేసి ఉంచకూడదు. దీని వల్ల వాటిలో ఆగ్రహం పెరుగుతుంది.
- వీధి కుక్కలు వెంబడించినప్పుడు బైకులు, సైకిళ్ల వేగం పెంచకూడదు.

కుక్కకాటుకు ఇలా చేయాలి

- కుక్క కరిచిన చోట కుళాయి లేదా మగ్గుతో నీటిని ధారగా పోస్తూ సబ్బుతో 10 నిమిషాలు కడగాలి.
- డెటాల్, లేదా గడ్డ గీసుకున్న తరువాత వాడే లోషన్ పూయాలి. వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించాలి. పిచ్చి కుక్క అయితే మాత్రం వెంటనే రేబిస్ టీకాలు వేయించాలి. కానీ, గాయాన్ని కడగకూడదు.

త్వరగా చర్యలు తీసుకోవాలి



మున్సిపాలిటీలో కుక్కల సంచారం అధికంగా పెరిగిపోయింది. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల సంచారాన్ని అరికట్టేందుకు వీలైనంత త్వరగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మట్టా ఉమాశంకరరావు,

వాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి



కుక్కకాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కుక్క కరిచిన వెంటనే ఆసుప్రతికి వచ్చి టీకాలు వేయించుకోవాలి. ఏరియా ఆసుపత్రికి ప్రతి నెల సుమారుగా 40 మంది వరకు కుక్క కాటు బారిన పడిన వారు వస్తున్నారు. వారికి వెంటనే చికిత్స చేసి పంపిస్తున్నాం.

– డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

పీజీ కోటా తగ్గింపుపై పునరాలోచన చేయాలి



కాజులూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 2025–26 విద్యా సంవత్సరంలో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ డాక్టర్లకు ఉన్న పీజీ (పోస్ట్ గ్రాడ్యుయేట్) కోటాను 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కిర్గిస్తాన్ (రష్యా కెఎస్ఆర్ యూనివర్సిటీ)లో విద్యనభ్యసిస్తున్న ఫైనల్ ఇయర్ విద్యార్థిని భార్గవిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం గొల్లపాలెంలో ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, పథకాలను రద్దు చేయటమే లక్ష్యంగా ప్రస్తుత పాలకులు పనిచేస్తున్నారే తప్ప ప్రజల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుంటున్నట్టు కనిపించట్లేదన్నారు. ఇన్‌సర్వీస్ పీజీ కోటా తగ్గించాలన్న ప్రభుత్వ నిర్ణయం గిరిజన, పల్లెటూర్ల ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులను తీవ్రంగా నిరుత్సాహ పరిచేలా ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో భవిష్యత్‌లో పల్లెటూర్లలో పనిచేయడానికి ఆసక్తి చూపే వైద్యుల సంఖ్యను కూడా ప్రభావితం చేస్తుందని ఆమె హెచ్చరించారు. ఇన్సర్వీస్ పీజీ కోటా తగ్గింపుపై ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేయాలన్నారు.

నేడు ద్రాక్షారామలో ర్యాలీ

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలోని రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాలను కాకినాడ జిల్లాలో కలపాలని కోరుతూ అఖిల పక్షం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధూ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 10 గంటలకు ద్రాక్షారామ బోసు బొమ్మ సెంటర్‌కు వర్తక, వ్యాపార వర్గాలు, విద్యార్థులు, ఆటో యూనియన్లు, రిక్షా కార్మికులు, చర్మకారుల సంఘాలు, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొవాలన్నారు.

ప్రమాదకరంగా జల్‌జీవన్ గోతులు



ద్రాక్షారామలోని రహదారి పక్కన ప్రమాదకరంగా గొయ్యి

రామచంద్రపురం రూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ ద్రాక్షారామలో ప్రజలకు మంచినీటి సదుపాయం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా పైపులైన్ ఏర్పాటు కోసం కాంట్రాక్టర్ తవ్వకాలు జరపడంతో గోతులు ఏర్పడ్డాయి. పలుచోట్ల సీసీరోడ్లు కూడా తవ్వేశారు. దీనిపై సాక్షి పత్రికలో అనేక కథనాలు వచ్చాయి. అధికారులు ఈ గోతులు కాంట్రాక్టరే పూడ్చుతారని చెప్పారు. కానీ, గ్రామంలో చాలాచోట్ల ఈ గోతులను ఎక్కడికక్కడే వదిలేశారు. దీంతో ద్రాక్షారామ పీహెచ్‌సీ నుంచి పశువుల ఆసుపత్రి వైపు వెళ్లే దారిలో ఏర్పడిన గోతిలో ఎవరు పడకుండా ఉండటానికి స్థానికులు ఓ కర్రను ఏర్పాటు చేసి దానికి టవల్ తగిలించారు. ఇప్పటికైనా గ్రామంలో తవ్విన గోతులు, రోడ్ల పక్క ఎడ్జ్‌లు బాగు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రజలు కోరుతున్నారు.

సాధారణ స్థితికి గోదావరి



కోటిపల్లి ఫెర్రీలో సాధారణ స్థితిలో ప్రవహిస్తున్న గోదావరి

కె.గంగవరం: నాలుగు రోజులుగా ఉగ్ర రూపం దాల్చిన గోదావరి వరద ఆదివారం సాయంత్రానికి సాధారణ స్థితికి చేరుకుంది. ఇప్పటివరకు భయం గుప్పెట్లో ఉన్న లంక గ్రామాలు, గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు గోదావరి తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు. కోటిపల్లి ఫెర్రిలో గోదావరి వరద పుష్కర మెట్లకు దిగువ నుంచి ప్రవహిస్తుంది. స్థానిక మత్స్యకార కాలనీలో ఇళ్లను చుట్టుముట్టిన వరద నీరు తగ్గింది. కూళ్ల నుంచి మసకపల్లి వరకు ఉన్న పుష్కర ఘాట్లు, కోటిపల్లిలో ప్రధాన పుష్కర ఘాట్లు వరద నీరు తగ్గడంతో బురదమయంగా మారాయి. కోటిపల్లిలో గోదావరి వరద తగ్గి ప్రవహిస్తుండడంతో సందర్శకులు గోదావరిని చూసేందుకు ఆసక్తి కనబరిచారు. వరద ఉధృతి తగ్గినా ఇంకా పంటు ప్రయాణానికి రెవెన్యూ అధికారులు అనుమతి ఇవ్వలేదు. ముక్తేశ్వరం రేవు వద్ద రోడ్డు మార్గం కొట్టుకుపోవడంతో పంటు ప్రయాణానికి ఇంకా కొన్ని రోజుల వేచి చూడాల్సి ఉంది.

శాంతించిన గోదారమ్మ



అప్పనపల్లి కాజ్‌వేపై ప్రవహిస్తున్న గోదావరి వరద

మామిడికుదురు: లంక గ్రామాలను గోదావరి వరద ఇంకా వీడలేదు. తీర గ్రామాలకు వెళ్లే ప్రధాన కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉంది. దీంతో వరద నీటిలో దిగి స్థానికులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. అప్పనపల్లి కాజ్వే ఆదివారం ఇంకా ముంపు నీటిలోనే ఉంది. దీనిపై అగుడున్నర మేర వరద నీరు ప్రవహిస్తోంది. ఈ వరద నీటిలోనే దిగి అష్టకష్టాలు పడుతూ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మామిడికుదురు శివారు కొర్లగుంట నుంచి ఉచ్చులవారిపేట మీదుగా మొల్లేటివారిపాలెం వెళ్లే సీసీ రోడ్డు పూర్తిగా ముంపు నుంచి తేరుకుంది. దీంతో ఈ మార్గం మీదుగా అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలకు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. ఫోర్ వీలర్స్ సైతం ఇదే మార్గంలో వెళ్తున్నాయి. వరద కష్టాల నుంచి తీర గ్రామాల ప్రజలకు శాశ్వత విముక్తి కలిగించే దిశగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని లంక గ్రామాల వాసులు వేడుకుంటున్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: గౌతమీ గోదావరికి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. దీంతో లంక పరివాహక ప్రాంతాల్లో సాధారణ పరిస్థితికి చేరుకుంటున్నాయి. గత వారం రోజుల నుంచి ఉగ్రరూపం దాల్చిన గౌతమీ గోదావరి ఇప్పుడిప్పుడే శాంతిస్తుంది. బడుగువానిలంకలోని కొన్ని లంక భూముల్లో ఇప్పటికే చేరుకున్న వరద నీరు క్రమేపీ తగ్గుతూ వస్తుంది. బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లోని రైతులు వరద ముంపు తప్పింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు బారీగా తగ్గుముఖం పట్టడంతో గోదావరికి వరద ప్రభావం లేదని అధికారులు భావిస్తున్నారు.

కాజ్‌వేపై కొనసాగుతున్న వరద

అయినవిల్లి: మండలంలోని లంక గ్రామాల్లో వరద శాంతించింది. వరదనీటి ప్రవాహం ఇంకా లంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో కొనసాగుతుంది. ముక్తేశ్వరం-అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే వరద కొనసాగుతోంది. వరదతో కొట్టుకొచ్చిన చెత్త, బురదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు మూడు రోజుల్లో యథాస్థితి కొనసాగుతుందని అధికారులు తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, అలాగే వేడి వేడిగా ఉండగానే ఆహారాలు తినాలని వైద్యులు సూచిస్తున్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దుర్మార్గం



ఆలమూరులో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఆలమూరు: రాష్ట్ర వ్యాప్తంగా అర్హులందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేయాల్సిన ప్రభుత్వం ఏకపక్షంగా ఏళ్ల తరబడి ఉన్న దివ్యాంగుల పింఛన్లను తొలగించడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. ఆలమూరులో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ నేలపూడి లావణ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు వచ్చి కూటమి ప్రభుత్వం హామీల అమలులో విఫలమైన తీరును వివరించారు. ఈసందర్భంగా పింఛన్‌ను తొలగించబడిన బాధితులు తమ సమస్యలను మండల కన్వీనర్ తమ్మన వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్‌దారులెవరూ ఆందోళన చెందవద్దని రాబోయే కాలంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి నేతలు చేసిన తప్పులను సరిదిద్దుతామని వ్యాఖ్యానించారు. పార్టీ నేతలు నామాల శ్రీనివాసు, గుణ్ణం రాంబాబు, నాయుడు ప్రసాద్, కొప్పనాతి శ్రీనివాసు, నాంద్ర నాగమోహన్‌రెడ్డి, కోలా నాని, నాతి కుమార్‌రాజా, చిన్నం వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

అర్హతలున్నా పింఛన్లు పీకేశారు

అంబాజీపేట: అన్ని విధాలా అర్హతలు ఉన్నా తమ పింఛన్లను కూటమి ప్రభుత్వం పీకేసిందని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వికలాంగ పింఛన్ రూ.6 వేలకు పెంచామని ఓ వైపు గొప్పలు చెప్పుకుంటూనే అంబాజీపేట మండలంలో 102 మంది అర్హులను అకారణంగా తొలగించేశారని పింఛనుదారులు విమర్శిస్తున్నారు. రీ వెరిఫికేషన్ పేరిట పరిశీలన చేసి పింఛన్లు రద్దు చేసి అనర్హులుగా నోటీసులు పంపడంతో అవాక్కయ్యారు. దీంతో బాధితులు ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతూ తమకు అన్యాయం చేయవద్దని వైకల్యం చూసి కనికరించాలని వేడుకుంటున్నా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా ఏడాదిలో రెండు సార్లు కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. అర్హతే ప్రామాణికంగా ఏటా జనవరి, జూలై నెలల్లో ఎటువంటి సిఫారసులు లేకుండానే లబ్ధిదారుల ఎంపిక జరిగేది. గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఎక్కడికి వెళ్లాల్సిన పని లేకుండా పింఛన్ పొందేవారమని పింఛనుదారులు చెబుతున్నారు.

డీఎస్సీలో సత్తా చాటిన ఉద్యోగులు



బొక్కా శివగణేష్



ఉందుర్తి వీరవేణి

రామచంద్రపురం: మండలంలోని ద్రాక్షారామకు చెందిన బొక్కా శివ గణేష్ డీఎస్సీ ఫిజికల్ సైన్స్ కేటగిరీలో 82 మార్కులతో 4వ ర్యాంకు సాధించాడు. తన భార్య రేణుక, తల్లిదండ్రులు చిన్నమ్మ, వీరభద్రరావుల ప్రోత్సాహంతో ఈ ఘనత సాధించనిట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం ముమ్మిడివరం మండలం మల్లయ్యపాలెం ఎంపీపీ స్కూల్‌లో ఎస్‌జీటీ విధులు నిర్వర్తిస్తున్నారు. 2018 డీఎస్సీలో ఎస్‌జీటీ విభాగంలో 3వ ర్యాంకు సాధించారు. ఇప్పుడు స్కూల్ అసిస్టెంట్ పీఎస్ కేటగిరీలో 4వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

భర్త ప్రోత్సాహంతో..

రాయవరం: మండలంలోని వెంటూరుకు చెందిన ఉందుర్తి వీరవేణి డీఎస్సీలో 79.95 స్కోరు సాధించి 19వ ర్యాంకు పొందింది. వీరవేణి స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ కేటగిరీలో ఈ ప్రతిభ కనబర్చింది. ప్రస్తుతం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రిలో ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీగా విధులు నిర్వర్తిస్తోంది. ఒక పక్క ఉద్యోగం చేస్తూనే మొక్కవోని దీక్షతో డీఎస్సీకి ప్రిపేరై ఈ ఘనత సాధించింది. భర్త భరత్‌కుమార్ ప్రోత్సాహంతోనే తాను ఈ ఘనత సాధించినట్లు వీరవేణి తెలిపింది.

ముందస్తు అనుమతులు పొందాలి



రాయవరం పోలీస్ స్టేషన్ వద్ద కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న సీఐ

రాయవరం: వినాయక ఉత్సవాలకు మండపాలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీలు ముందస్తు అనుమతులను తప్పనిసరిగా పొందాలని మండపేట రూరల్ సీఐ దొరరాజు సూచించారు. రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఉత్సవ కమిటీలతో సమావేశాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ, ఉత్సవాల వద్ద ఇతర వ్యక్తులను, ప్రార్థనా మందిరాలను రెచ్చగొట్టే విధంగా ఎటువంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు, ఐదు అడుగుల ఎత్తు ఉండే విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు, శాంతిభద్రతలను అదుపులో ఉంచేందుకు అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు. సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని సూచించారు. అగ్నిమాపక, విద్యుత్, పోలీసు శాఖల నుంచి నిరభ్యంతర సర్టిఫికెట్ పొందాల్సి ఉందన్నారు. అనుమతులకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను లామినేషన్ చేసి, ఉత్సవాలను నిర్వహించే పందిరిలో డిస్‌ప్లే చేయాలన్నారు. తనిఖీలకు వచ్చే అధికారులకు క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచాలని కమిటీలకు సూచించారు. నిమజ్జనాల సమయంలో కూడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కాజులూరు: వరి పంటపై పోటాష్ ఎరువును రైతులు సమయాను కూలంగా వినియోగించాలని మండల వ్యవసాయాధికారి అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ, పంట దమ్ములో మొదటి దఫాగా 25 కేజీల పోటాష్ ఎరువును విధిగా వేయాల్సి ఉందన్నారు. రెండో దఫాగా వరి మొక్క చిరు పొట్ట దశలో మరో 25 కేజీల పోటాష్‌ను వేసినట్లైతే ఓ మోస్తరు తేలికపాటి గాలులకు పంట పడిపోకుండా ఉండి అధిక దిగుబడులకు అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ సేద్యంలో రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులను సక్రమంగా నిర్వహించినప్పుడే పైరు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడులు సాధించగలుగుతారన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన వరద వెంకట రామ లింగేశ్వరరావు, విశాలాక్షి దంపతులు రూ.10,116, అమలాపురానికి చెందిన తాటిపర్తి వెంకట రమేష్, ఉదయ భానులక్ష్మి దంపతులు రూ.10,116 ఆదివారం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను ఆలయ అర్చకులు, వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం

రావులపాలెం: ప్రమాదవశాత్తూ వేడి నీళ్ల పడి గాయపడిన బాలుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.18 వేల ఆర్థిక సాయాన్ని అందజేసినట్టు సంస్థ సభ్యులు ఆదివారం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం దర్శిపర్రుకి చెందిన 22 నెలల బాలుడు వరికూటి రాజేష్ రెండు వారాల క్రితం వేడి నీళ్లల్లో చేతులు పెట్టడంతో రెండు చేతులు తీవ్రంగా కాలిపోయాయి. వైద్యానికి రూ.2 నుంచి 3 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. కూలి పని చేసుకునే బాబు తండ్రికి అంత స్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో బాబు తండ్రి ఏసుబాబుకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.18 వేల చెక్కు అందజేశారు.